క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన సబ్ కలెక్టర్



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న అభిషేక్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.సృజనను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ఆమెను కలసి పుష్పగుచ్ఛం అందజేసి ఆదోని డివిజన్‌లోని సమస్యలపై ఆమెతో చర్చించారు.

మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జగన్నాథగట్టులో మట్టి మాఫియా ఆగడాలు అధికమయ్యాయని, అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ఎన్ రసూల్, కె. జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇటీవల జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లోని మట్టిని కొందరు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలించారన్నారు. పోలీసులు కలగజేసుకొని జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై గర్జన



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు

కర్నూలు(సెంట్రల్) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై గర్జిస్తామని ఏఐటీయూసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి జి.ఓబులేషు అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులను కాలరాసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మే 1వ తేదీన మోదీ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక గర్జనను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మునెప్ప, కృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గిరిజనుల మనోభావాలు దెబ్బతీయొద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు (సెంట్రల్): గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఎరుకల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపాల్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎరుకలి వీరేష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎరుకల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కావేటి మద్దిలేటి, నాయకులు ఎల్లప్ప, ఉలిగప్ప, ఈరన్న, నర్సప్ప, నరేష్ పాల్గొన్నారు.

చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

కల్లూరు: నగరంలోని మట్టి పని అడ్డాల్లో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు కె.సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు సూర్యనారాయణ భవనంలో శరీన్‌నగర్ మట్టి పని అడ్డా మేస్త్రీల సమావేశం నగర ఉపాధ్యక్షుడు ఏసు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు ఇబ్బంది పడకుండా అడ్డాల్లో నిలువ నీడ కల్పించాలన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : దసరా, రావణాసుర, మీటర్, ది పోప్స్ ఎక్సార్సిస్ట్, బలగం
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : ది పోప్స్ ఎక్సార్సిస్ట్, మీటర్, దసరా, రావణాసుర, దాస్ కా ధమ్కీ, దేశముదురు
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, దసరా, రావణాసుర
ఐనాక్స్ : ది పోప్స్ ఎక్సార్సిస్ట్, ది సూపర్ మారియో బ్రదర్స్, జాన్ విక్ చాప్టర్-4, రావణాసుర, భోలా
భరత్ కాంప్లెక్స్ : బలగం, దాస్ కా ధమ్కీ, దేశముదురు
శ్రీరామ : మీటర్
రాజ్ : రావణాసుర
విజయ : మీటర్



నృత్యం చేస్తున్న రేణుశ్రీ



సాధించిన మెమెంటోలు, సర్టిఫికెట్లతో రేణుశ్రీ

గజ్జె కట్టి.. భళా అనిపించి!

- కూచిపూడి నాట్యంలో రాణిస్తున్న రేణుశ్రీ
- వందలకు పైగా ప్రదర్శనలు.. ప్రముఖుల ప్రశంసలు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు
- గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు

కర్నూలు కల్చరల్: చిన్న వయస్సులోనే కాళ్లకు గజ్జెలు కట్టింది. నాట్యమయూరిలా నృత్యం చేస్తూ వందల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు సొంతం చేసుకుంది. చదువుతో పాటు సంప్రదాయ నృత్యం కూచిపూడిలో రాణిస్తున్న రేణుశ్రీ విజయ గాథ ఇది.

కర్నూలు సీతారామనగర్‌కు చెందిన రేణుశ్రీ స్థానిక సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) తృతీయ సంవత్సరం చదువుతోంది. తల్లి జయంతి గృహిణి. తండ్రి నాగరాజు కిరాణం దుకాణం నిర్వహిస్తున్నారు. చిన్నప్పుడు రేణుశ్రీ బుడిబుడి అడుగుల్లో ఏదో తెలియని కొత్తదనం కనిపించింది తల్లిదండ్రులకు. మంచి నృత్య కారిణిగా తీర్చిదిద్దాలని భావించి వారు ఏడేళ్ల వయస్సులో నృత్యజ్యోతి డ్యాన్స్ అకాడమీలో చేర్పించారు. నృత్య శిక్షకులు డాక్టర్ కె.వి. భార్గవ్‌కుమార్ దగ్గర శిక్షణ ఇప్పించారు. అనతి కాలంలోనే శిక్షణ పూర్తి చేసుకుని చదువుతో పాటు నృత్యంలో రాణించడం మొదలుపెట్టింది. గత 13 ఏళ్లుగా జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయిలో వందల ప్రదర్శనలు ఇచ్చి ఎందరో మన్ననలు అందుకుంది. నేటికీ అందుకుంటోంది. ఇప్పటికే నృత్య ప్రియ అవార్డును సొంత చేసుకోవడంతో పాటు కూచిపూడి నృత్యంలో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసింది. మంచి నృత్య కారిణిగా, నృత్య శిక్షకురాలుగా ఉన్నతంగా రాణించడమే తన లక్ష్యమని చెబుతోంది రేణుశ్రీ.

ప్రతిభా పాటవాలు

- కూచిపూడి నృత్యంలో రెండు సంవత్సరాల ప్రారంభిక, మూడు సంవత్సరాల భూషన్, రెండు సంవత్సరాల విశారద కోర్సులను పూర్తి చేసి డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారు.
- రాజస్థాన్, సిక్కిం, గుజరాత్ రాష్ట్రాల వద్ద ఇండియా పాకిస్తాన్, ఇండియా చైనా బార్డర్‌కు వెళ్లి అక్కడ సైనికులతో రక్షాబంధన్‌ను జరుపుకుని నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
- ఢిల్లీ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
- పాల్గొన్న ప్రతి పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు ఎందరో ప్రశంసలు అందుకున్నారు.
- ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయ సాంస్కృతిక మేళాలో పలు మార్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.
- 2012, 2014, 2016 సంవత్సరాల్లో సిలికాన్ ఆంధ్ర వారు నిర్వహించిన నృత్యోత్సవ్‌లో సత్తా చాటడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది.
- 2018 సంవత్సరంలో నృత్య జ్యోతి అకాడమీ వారు నృత్య ప్రియ అవార్డును ప్రదానం చేశారు.
- 2023లో మానవత సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో సన్మానం అందుకున్నారు.
- 2023లో జిల్లా యువజన శాఖ నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానంలో అవార్డు అందుకుంది. ఇలా జిల్లా,రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక అవార్డులు సొంతం చేసుకుంది.

16న తెలుగు నాటక రంగ వేడుకలు

కర్నూలు కల్చరల్: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఈనెల 16వతేదీన తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. 14 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 14,15 తేదీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నాటక రంగ సంస్థలకు ఏకాంకము పద్య పోటీలు జరుగుతాయని తెలిపారు. 14వ తేదీ రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ రాయబారం, కర్ణ రహస్యము, సుభద్రా రాయబారం, గయోపాఖ్యానం, తులా భారం, అలక సీను, 15న మాయల మరాఠీ, గయపాఖ్యానం, సత్య హరిశ్చంద్ర కాటి సీను ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. 16వ తేదీ సాయంత్రం 7 గంటలకు టీజీవీ కళాక్షేత్రం కళాకారులతో శ్రీకృష్ణ కర్ణార్జునీయం పద్యనాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాటక రంగంలో విశేష సేవలు అందించిన కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేయడంతో పాటు 14, 15 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమ నిర్వహణ కన్వీనర్లుగా లక్ష్మీకాంతరావు, రాజారత్నం వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి



హెచ్‌ఓడీలతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, సిబ్బందికి కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన తన ఛాంబర్‌లో ఆసుపత్రిలోని వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో కోవిడ్ కేసులు వస్తే ఎక్కడ అడ్మిషన్ ఇవ్వాలి, ఎలా నియంత్రించాలి, అవసరమైన ఆపరేషన్ థియేటర్స్, పడకలు, ఆక్సిజన్, వెంటిలేటర్లు, మందులు, నిర్వహణ ఎలా చేయాలనే విషయాలపై సమీక్షించారు. ఆసుపత్రిలోని ట్రయేజ్ (99వ ఓపీ)లో 80 పడకల విభాగాన్ని సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీరాములు, అనస్థీషియా హెచ్ఓడీ డాక్టర్ విశాల, ఈఎండీ ఇన్‌చార్జ్ డాక్టర్ రామ్‌శివనాయక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని పరిరక్షించండి



నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు వినతులు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : తమ కాలనీలో మున్సిపల్ పార్కును ఆక్రమించుకుంటున్నారని, దానిని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ఇంజినీర్స్ కాలనీకి చెందిన సోనియా నగరపాలక అధికారులను కోరారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ వాటిని స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. స్పందనలో ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

24న రాయలసీమ కర్తవ్య దీక్ష

కర్నూలు కల్చరల్: సిద్ధేశ్వరం-సోమశిల ప్రాజెక్ట్ దగ్గర బ్రిడ్జి కం బ్యారేజీను నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన రాయలసీమ మేధావుల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి బైరెడ్డి మాట్లాడారు. రూ.1200 కోట్లతో సిద్ధేశ్వరం-సోమశిల దగ్గర ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తున్నారని ఐకానిక్ బ్రిడ్జి కంటే బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మిస్తే రాయలసీమకు నీటి సమస్య తీరడంతో పాటు సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఆమ్‌ఆద్మీ రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ బీవీ సుబ్బారెడ్డి, రాయలసీమ ఉద్యమ సంఘాల నాయకులు రవికుమార్, సీమకృష్ణ, అశోక్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ఎదుట నిరసన

కర్నూలు(సెంట్రల్): జోహరాపురంలోని 18వ వార్డు పరిధి మాలగేరిలో ఉన్న పురుషుల పబ్లిక్ టాయిలెట్లను నిరంతరంగా అందుబాటులో ఉంచాలని సీపీఎం నాయకులు శ్రీరామ్, కరుణాకర్ కోరారు. సోమవారం ఆ వార్డు నాయకులు సచివాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం 15రోజులు తెరచి..మరో 15 రోజులు మూసి వేస్తుండడంతో ఇబ్బందిగా ఉందన్నారు.

ఊరూరా 'జగనన్నే మా భవిష్యత్తు'

కల్లూరు:మన అందరి భవిష్యత్‌ను తీరిదిద్ద గల నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, కల్లూరు మండల వైస్ ఎంపీపీ-2 చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ వార్డుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులు కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించి, 82960 82960 నెంబర్‌కు మిస్డ్‌కాల్ చెయించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేష్ గౌడ్, రాజు, హుస్సేన్ ఆలం, సచివాల కన్వీనర్ భూపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కోడుమూరు ఎస్‌ఐగా శ్రీనివాసులు

కోడుమూరు: కోడుమూరు ఎస్‌ఐగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న విష్ణు నారాయణను వీఆర్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో కర్నూలు త్రీటౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసులును నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోఆయన బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



రథం లాగుతున్న నగర మేయర్ బీవై రామయ్య, తదితరులు



ప్రత్యేక అలంకారంలో సీతారామ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ మెయిన్‌బజార్‌లో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఏకాంతరామాలయం స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వేద పండితులు శాస్త్రోక్తంగా సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అశేష భక్తజనం మధ్య స్వామి, అమ్మవార్ల దివ్య భవ్య కల్యాణం నిర్వహించారు. శ్రీరామ చంద్ర, సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత మూర్తులను రథంలో ఊరేగించారు. కోలాటం, చెక్క భజనలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణాలతో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అంతకు ముందు మూల మూర్తులకు పంచామృతాభిషేకం, సుప్రభాత సేవ, పూలంగి సేవ, ప్రత్యేక అలంకారం, దర్శనం కల్పించారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, యువ పారిశ్రామిక వేత్త టీజీ భరత్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వ్యాసరాజ్, సహ కార్యదర్శి ప్రాణేష్ పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, నగర అధ్యక్షుడు మద్దిలేటి, బీజేపీ నాయకులు హరీష్‌బాబు, ఆర్‌ఎస్ఎస్ నగర చాలక్ సూరా వెంకటరెడ్డి,ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి రామ్మూర్తి ఆచార్య, జయతీర్థ, వేదవ్యాస్, ప్రభాకర్, రాఘవేంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కోలాటమాడుతున్న బాలికలు

క్రైం కార్నర్

రాగమయూరిలో పట్టపగలే చోరీ

- 20 తులాల బంగారు నగలు, రూ.10 వేలు నగదు అపహరణ



బీరువాను తెరిచిన దృశ్యం

ఓర్వకల్లు: నన్నూరు గ్రామ శివారులోని రాగమయూరి గ్రీన్‌హిల్స్‌లో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన శ్రీనివాసులు, భార్య రామలక్ష్మి రాగమయూరిలోని 21వ లైన్‌లోని 444 నంబర్ గల ఇంటిలో నివాసముంటున్నారు. శ్రీనివాసులు ఇటీవలే కర్నూలు నగరంలోని రేడియో స్టేషన్‌లో ఉద్యోగం చేస్తూ స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. శ్రీనివాసులు భార్య రామలక్ష్మి నంద్యాల పరిధిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. సోమవారం ఉదయం స్థానిక టోల్‌గేట్ వద్ద భార్యను వదిలి బంధువును పరామర్శించేందుకు శ్రీనివాసులు కర్నూలుకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరపడ్డారు. బీరువాలో ఉన్న 20 తులాల బంగారు నగలు, రూ.10 వేల నగదును దోచుకెళ్లారు. భార్యాభర్తలు ఇద్దరు సాయంత్రం ఇంటికి వచ్చి చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. విషయాన్ని పోలీసులకు తెలపడంతో ఎస్‌ఐ మల్లికార్జున, కర్నూలు రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

హోమియోపతి వైద్యానికి ఆదరణ

కర్నూలు(హాస్పిటల్): హోమియోపతి వైద్యానికి మన దేశంలోనూ ఇటీవల మంచి ఆదరణ లభిస్తోందని లయన్స్ గవర్నర్ ఏరియా ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు.దయాల్బాగు రాధాస్వామి చారిటబుల్ హోమియో డిస్పెన్సరి ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్న హోమియో వైద్యులు డాక్టర్ కె. భాస్కరరెడ్డిని సన్మానించారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు, మొండిరోగాలకు హోమియోపతి వైద్య విధానంలో మంచి ఫలితాలు ఉన్నాయని తెలిపారు. డాక్టర్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ హోమియోపతి వ్యవస్థాపకుడు డాక్టర్ హనీమన్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 10న ప్రపంచ హోమియోపతి దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ కార్యదర్శి సి.గోవర్ధన్‌గిరి, పవన్, మంజునాథ్‌రెడ్డి, మోహన్, సుల్తాన, నవాబ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోడుమూరు రూరల్: బైక్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కోడుమూరు-కర్నూలు రహదారిలో కొత్తూరు గ్రామ సమీపంలో ఈ దుర్ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆస్పరి మండలంలోని హరిగెర గ్రామానికి చెందిన వీరన్న కుమారుడు శ్రీనివాసులు(37) హైదరాబాద్‌లో పని చేసుకుంటూ అక్కడే నివాసముంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన శ్రీనివాసులు తిరిగి హైదరాబాద్‌కు బైక్‌పై వెళుతుండగా కొత్తూరు సమీపంలో కర్నూలు నుంచి కోడుమూరు వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను కోడుమూరు సీఐ శ్రీధర్ తన సిబ్బందితో కలిసి పట్టణంలో అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనివాసులుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

పోస్టుల భర్తీలో న్యాయం చేయండి

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేసిన పోస్టుల్లో స్థానికులకు అన్యాయం జరిగిందని సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ సృజనకు అభ్యర్థుల కుటుంబ సభ్యులు నారాయణ స్వామి, సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ జె.ఎన్.శేషయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య వినతి పత్రం సమర్పించారు. గత నెల 17,18 తేదీల్లో జోన్ల వారీగా జరిగిన పోస్టుల భర్తీలో ఒక జోన్‌లో ఇంటర్వ్యూలకు హాజరైతే మరో జోన్‌కు ఎంపిక చేసి పోస్టింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. నాలుగో జోన్ ఇంటర్వ్యూలు కర్నూలు కళాశాలలో జరిగితే ఇక్కడ ఇంటర్వ్యూలకు హాజరు కాని వారికి కూడా పోస్టింగ్ ఇచ్చారని వెల్లడించారు. దీనిపై విచారణ చేయించి స్థానికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌లో దువా చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి

రంజాన్ మాసం సందర్భంగా సోమవారం నగరంలోని 6వ వార్డు గరీబ్ నగర్‌లోని యాసిన్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. ముందుగా మసీదు పెద్దలతో కలసి దువా చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని అమీరుద్దిన్ మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. తర్వాత ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థన చేశారు. – కర్నూలు(రాజ్‌విహార్)